సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 4 । జూలై । 2025



బిందు సేద్యంలో ..

బిందు సేద్యంలో తక్కువ నీరు ఉన్నా పంటలు సాగు చేసుకోవచ్చని కేవీకే శాస్త్రవేత్త చంద్రశేఖర్ సూచించారు. - 4లో



జైలు శిక్ష

చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి కోదాడ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె. భవ్య ఆరు నెలల జైలు శిక్ష విధించారు. - 4లో



పాత కమిషనర్ వెళ్లలేదు..

ఆలేరు మున్సిపాలిటీలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ప్రస్తుత కమిషనర్ బదిలీ అయినా రిలీవ్ కావడం లేదు. - 4లో

న్యూస్‌రీల్

రైతులు జాగ్రత్త వహించాలి

సూర్యాపేటటౌన్ : రైతులు వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని ఎస్పీ నరసింహ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. వ్యవసాయ సంబంధ విద్యుత్ తీగలు తెగడం లాంటి సమస్యలు వస్తే రైతులు ట్రాన్స్‌కో అధికారులను ఆశ్రయించాలి లేదా టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసి ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. అత్యవసర సమయంలో పోలీసు సేవలకు డయల్ 100కు ఫోన్ చేయవచ్చు కోరారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



పీహెచ్‌సీలో వ్యాధి నిరోధక టీకాల రికార్డును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్

పెన్‌పహాడ్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్ సూచించారు. గురువారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఆస్పత్రులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి స్రవంతి, హెచ్‌ఈఓ చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ భూతరాజు సైదులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పర్వీన్ కౌసర్

మద్దిరాల : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పర్వీన్‌కౌసర్ సూచించారు. గురువారం మదిరాల మండల పరిధిలోని గుట్టకాడి తండాలో న్యాయ చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో తుంగతుర్తి కోర్టు సివిల్ జడ్జి గోస్‌పాషతో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. చట్టాలు ఎవరికీ చుట్టాలు కావని, చట్టాల ముందు అందరూ సమానమేనని ఆమె పేర్కొన్నారు. పేద, ధనిక తారతమ్యం లేకుండా చట్టాల ద్వారా అందరికీ న్యాయం జరుగుతుందని ఆమె తెలిపారు. చట్టాలను ఎవరూ తమ చేతుల్లోకి తీసుకొని నేరస్తులు కాకూడదని ఆమె హితవు పలికారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లను నియమించిందని డబ్బులు ఖర్చుకాకుండా వారి ద్వారా కోర్టును ఆశ్రయించే అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన వృద్ధులు చాలా మంది పింఛన్ రావడంలేదని తన దృష్టికి తీసుకొచ్చారని ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆమె చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపెల్లి లింగయ్య, తాళ్లపెల్లి సత్యనారాయణ, లాయర్లు, తండ వాసులు తదితరులు పాల్గొన్నారు.

5న ఉమ్మడి నల్లగొండ అండర్- 19 క్రికెట్ జట్టు ఎంపిక

నల్లగొండ టౌన్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5న నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్ -19 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక చేయనున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సయ్యద్ అమీనుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జట్టు ఎంపిక ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 2006 తరువాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 98857 17996 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

దుర్గంధం.. పొగ

మున్సిపాలిటీల్లో డంపింగ్ యార్డుల నిర్వహణ అస్తవ్యస్తం

మున్సిపాలిటీల్లో డంపింగ్ యార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపం.. పారిశుద్ధ్య కార్మికుల అలసత్వం.. వెరసి ప్రాసెసింగ్ చేయడంలో జాప్యం కారణంగా గుట్టలు గుట్టలుగా చెత్త పేరుకుపోతోంది. ఈ చెత్తకు నిప్పు పెడుతుండడంతో వచ్చే పొగతో పరిసర ప్రాంతాల ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. తడి చెత్త బయోమైనింగ్ చేయడంలో ఆలస్యమవుతుండడంతో కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఈగలు దోమలు ముసురుకుంటున్నాయి. సూర్యాపేటలో చెత్తతో వర్మీకంపోస్టు, టైల్స్ తయారు చేస్తుండగా మిగతా నాలుగు మున్సిపాలిటీల్లో అలాంటి ఏర్పాట్లు లేవు. వర్షాకాలంలో మరిన్ని ఇబ్బందులు తలెత్త కుండా చెత్త సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

- బయోమైనింగ్ చేయడంలో జాప్యం
- గుట్టలుగా పేరుకుపోతున్న చెత్తాచెదారం
- తడి చెత్త కుళ్లిపోయి దుర్వాసన.. ముసురుకుంటున్న ఈగలు, దోమలు
- చెత్తకు నిప్పుపెడుతుండడంతో పొగతో శ్వాసకోశ వ్యాధులు
- వర్షాకాలంలో మరిన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం



తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తకుప్పలు

వర్మీకంపోస్టు, టైల్స్ తయారీ

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట మున్సిపాలిటీలో 48 వార్డుల నుంచి 56 వాహనాల్లో సుమారు 30 టన్నుల తడి చెత్త (కూరగాయలు, పండ్ల వ్యర్థాలు), 15 టన్నుల పొడి చెత్త, ఐదు టన్నుల మిక్స్‌డ్‌గా ఉన్న చెత్తను సూర్యాపేట శివారు ప్రాంతంలో ఉన్న బాలెంల డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. అక్కడ పొడి చెత్తను సెగ్రిగేషన్ మిషన్ ద్వారా వేరుచేస్తున్నారు. కాగితాలను మిషన్‌లో వేసి బేళ్లుగా తయారు చేస్తున్నారు. ప్రాసెసింగ్ చేయడంలో జాప్యం వల్ల గుట్టలుగా పేరుకుపోయి దుర్వాసన వస్తోంది.



జమునా నగర్‌లోని డంపింగ్ యార్డులో వేసిన తడిచెత్త

పాలిథీన్ కవర్లు, కూరగాయలు, పండ్ల వేస్టేజ్‌ను జమునానగర్‌లోని డంపింగ్ యార్డ్‌కు పంపిస్తున్నారు. అక్కడ ప్లాస్టిక్ కవర్లను మిషన్‌లో వేసి ముద్దలుగా తయారు చేయడంతో పాటు పార్కింగ్ టైల్స్, స్పీడ్ బ్రేకర్స్ లాంటి వస్తువులను కూడా తయారు చేస్తున్నారు. తడి చెత్తతో వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసి కిలో రూ.5చొప్పున రైతులకు విక్రయిస్తున్నారు.

నివాసాలకు సమీపంలోనే..



పాత నేరేడుచర్లలో డంపింగ్ యార్డు

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని పాత నేరేడుచర్ల– కమలానగర్ ప్రాంతాల మధ్య డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. 15 వార్డుల నుంచి ఐదు ఆటోలు, ఒక ట్రాక్టర్ ద్వారా రోజూ ఐదు మెట్రిక్ టన్నుల చెత్త సేకరించి డంపింగ్ యార్డులో వేస్తున్నారు. దీని నుంచి వెలువడుతున్న దుర్వాసనతో చుట్టుపక్కల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డు నుంచి పెద్ద పెద్ద ఈగలు ఇళ్లలోకి వచ్చి తినేపదార్థాలపై వాలడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. డంపింగ్ యార్డు కోసం రూ.64లక్షలు మంజూరైనా ప్రహరీ నిర్మించకపోవడంతో గాలి వీచినప్పుడు చెత్త రోడ్డుపై వెళ్లే వారిపై పడడంతో పాటు చుట్టూ ఉన్న పొలాల్లోకి వస్తోంది. రీసైక్లింగ్ చేసే యంత్రాలు లేక చెత్తకు నిప్పు పెడుతుండటంతో వచ్చే పొగతో శ్వాస ఆడటంలేదని, బూడిద ఇళ్లపై పడుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెత్తను కాలుస్తున్నారు



చెత్తకు నిప్పు పెట్టడంతో వస్తున్న పొగ

కోదాడ: కోదాడ మున్సిపాలిటీలో రోజూ సేకరిస్తున్న తడి, పొడి చెత్త వేరు చేయడంలో మున్సిపాలిటీ అధికారులు విఫలమవుతున్నారు. కోదాడ మున్సిపాలిటీకి రామిరెడ్డిపాలెం రోడ్డులో వెంకట్రాంపురం సమీపంలో డంపింగ్ యార్డ్ ఉంది. ఇక్కడ చెత్తను వేరు చేయడానికి ప్రత్యేకంగా షెడ్‌ను నిర్మించినా దాన్ని మున్సిపాలిటీవారు ఏనాడూ ఉపయోగించిన దాఖలాలు లేవు. ఇక పట్టణంలో ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి దాని నుంచి కంపోస్ట్ ఎరువును తయారు చేయడానికి పట్టణంలోని ఉత్తమ్ పద్మావతినగర్‌లోని నర్సరీలో ప్రత్యేంకంగా షెడ్లను ఏర్పాటు చేశారు. కానీ కేజీ కంపోస్టును కూడా తయారు చేయలేదు. ట్రాక్టర్లు, ఆటోలలో సేకరిస్తున్న చెత్తను ఎలాంటి ప్రాసెస్ చేయకుండానే నేరుగా డంపింగ్ యార్డులో కుప్పగా పోస్తున్నారు. దానికి తరచూ నిప్పు పెడుతుండడంతో వపొగ వస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కోతులు, కుక్కలు దాడి చేస్తున్నాయ్



నెల్లిబండ తండాకు వెళ్లే దారి పక్కన ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని నెల్లిబండ తండాకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే డంపింగ్ యార్డు నిర్మించారు. ఈ డంపింగ్ యార్డులో వేస్తున్న చెత్తా చెదారంతో వచ్చే దుర్వాసనతో ఈ దారి వెంట వెళ్లడానికి రైతులు, తండా వాసులు ఇబ్బందులుపడుతున్నారు. డంపింగ్ యార్డులోని చెత్తా చెదారం, ఇతర పదార్థాలను తినడానికి వందల సంఖ్యలో కోతులు, కుక్కలు వస్తున్నాయి. ఈ కోతులు చుట్టు పక్కల భూముల్లో ఏ పంట వేసినా దక్కనీయడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కోతులు, కుక్కలు తమ వెంట పడి దాడి చేసి గాయపరుస్తున్నాయని వాపోతున్నారు.

రామస్వామి గుట్ట వద్ద..



హుజూర్‌నగర్ పట్టణ శివారులోని గుట్ట సమీపంలో డంపు చేసిన చెత్త

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని రామస్వామి గుట్ట సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో వీధివీధి నుంచి సేకరించిన చెత్తను పట్టణానికి దాదాపు 2 కిలోమీటర్ల ఆవల ఉన్న ఈ యార్డులో డంప్ చేస్తున్నారు. ప్రస్తుతం దీని వల్ల ఎటువంటి ఇబ్బందులు లేవు. రాబోయే రోజుల్లో మోడల్ కాలనీ ఇళ్లను పంపిణీ చేసిన తర్వాత లబ్ధిదారులు వాటిలో నివాసం ఉంటే అప్పుడు కొంత అసౌకర్య కలగనుంది. ఈ విషయమై అధికారులు దూర దృష్టితో ఆలోచించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పింఛన్ల పంపిణీలో పొరపాట్లు జరగొద్దు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకం ద్వారా పంపిణీ చేస్తున్న పింఛన్లలో పొరపాట్లు జరగకుండా చూడాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లో చేయూత పథకంపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ సెక్రటరీలు, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పెన్షన్లు ఏ ఆధారం లేని వారికి ఆర్థిక భద్రత కలిగిస్తాయన్నారు. ఏ ఆధారం లేని వారికి పెన్షన్ అందిస్తే ఆదుకున్న వారమవుతామని పేర్కొన్నారు. పింఛన్లకు సంబంధించి ఎంపీడీఓలు, పంచాయతీ సెక్రటరీ లాగిన్‌లో ఉన్న వివరణ ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. చనిపోయిన వారి వివరాలను పంచాయతీ సెక్రటరీలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్డేట్ చేయాలన్నారు. ప్రత్యేకించి వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించి చనిపోయిన వారి పేర్లను ఒకటికి రెండుసార్లు పరిశీలించి తొలగించాలన్నారు. ఒకవేళ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు ఉంటే స్పష్టంగా పేర్కొనాలని ఆదేశించారు. చనిపోయిన వారి స్థానంలో వారి భార్య లేదా భర్తకు పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తపాలా కార్యాలయాల్లో కూడా పెన్షన్ల పంపిణీని జాగ్రత్తగా చేపట్టాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ వీవీ అప్పారావు, డీఎల్పీఓ నారాయణరెడ్డి, పోస్టల్ సూపరింటెండెంట్ వి.వెంకటేశ్వర్లు, జేపీఎం రవి, టీసీఎస్ అధికారి లోకేష్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ చివరినాటికి వనమహోత్సవ లక్ష్యం పూర్తి చేయాలి

వనమహోత్సవంలో భాగంగా జిల్లాకు ఇచ్చిన 59,884 మొక్కల లక్ష్యాన్ని 18 శాఖలు సమన్వయంతో పనిచేసి సెప్టెంబర్ చివరినాటికి పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ తెలిపారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లో వనమహోత్సవం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు, స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ సర్వేక్షణ్, శానిటేషన్‌పై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా డీఆర్‌డీఏకు 28,870 మొక్కలు, మున్సిపల్ శాఖకు 15,532, అటవీ శాఖకు 4,320, వ్యవసాయ శాఖకు 3,831, ఇరిగేషన్, సీడీఏ శాఖలకు 2,578 మొక్కలు కేటాయించినట్లు వివరించారు. వీటి కోసం స్థలాలు ఎంపిక చేయాలన్నారు. జాతీయ పంచాయతీ అవార్డులకు సంబంధించి తొమ్మిది థీమ్స్ గురించి డీఎల్పీఓ నారాయణరెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి సీతారాం నాయక్, డీఆర్‌డీఓ వీవీ అప్పారావు, డీఎఫ్ఓ సతీష్ కుమార్, డిప్యూటీ సీఈఓ శిరీష, డీపీఓ యాదగిరి పాల్గొన్నారు.

అడ్మిషన్లు పెంచడానికి స్పెషల్ డ్రైవ్

- డీఐఈఓ భానునాయక్



విద్యార్థికి అడ్మిషన్ ఇస్తున్న డీఐఈఓ భానునాయక్

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): జిల్లాలోని ఎనిమిది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచడానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈఓ) భానునాయక్ వెల్లడించారు. గురువారం ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. గత ఏడాది కన్నా ఈ సారి 30 శాతం అదనంగా ప్రవేశాలు పెంచే బాధ్యతను అధ్యాపకులు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు అవసరమైన టాయిలెట్స్, లైబ్రరీ, రీడింగ్ రూమ్స్, తరగతి గదులు, ఫర్నీచర్ అందుబాటులో ఉన్నాయని, ఉచిత పాఠ్యపుస్తకాలు సైతం అందిస్తున్నామన్నారు. నెమ్మికల్ కళాశాలలో ఇప్పటివరకు 127 అడ్మిషన్లు అయినట్లు తెలిపారు. ప్రతి తరగతిలో 40 మంది విద్యార్థులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గతంలో 2,200 అడ్మిషన్లు ఉన్నాయని ఈ ఏడాది 3,500 కు పెంచే బాధ్యత తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ గుణగంటి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖర్గే సమావేశానికి భారీగా పార్టీ కేడర్

- నేడు ఎల్‌బీ స్టేడియంలో సమావేశం
- తరలివెళ్లేందుకు సిద్ధమైన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు, నాయకులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లేందుకు పార్టీ వర్గాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ పరిస్థితి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరు తదితర అంశాలపై సమావేశంలో ప్రస్తావించనున్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి పార్టీ ముఖ్య కార్యకర్తలను పెద్ద ఎత్తున తరలించేలా మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, డీసీసీ అధ్యక్షులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇప్పటికే ముఖ్య కార్యకర్తలంతా తరలిరావాలని మంత్రులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దీంతో ప్రతి నియోజకవర్గం నుంచి 300 నుంచి 500 మంది వరకు ముఖ్య కార్యకర్తలు తరలివెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ పేర్కొన్నారు. కార్లు, జీపులు, ఇతర వాహనాల్లో పార్టీ శ్రేణులు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీ బలోపేతం కోసం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మొదటిసారిగా పార్టీ నేతలో సమావేశం నిర్వహిస్తున్నందున తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు.

లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి

- తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర నేత వీరభద్రం



సదస్సులో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

సూర్యాపేట : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకుడు తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంవీఎన్ భవన్‌లో తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. లేబర్‌కోడ్‌లను అమలు చేసి కార్మికుల హక్కులను హరించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. 2025 -26 బడ్జెట్‌లో కార్పొరేట్‌కు అనుగుణంగా కేటాయింపులు చేసిందన్నారు. సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టిందన్నారు. సామాన్యులపై భారం మోపి, పెట్టుబడుదారులకు రూ.5 వేల కోట్ల రాయితీ ప్రకటించిందన్నారు. ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలు పట్టించుకోలేదన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కార్మిక వర్గం ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రైతు పండించిన పంటకు మద్దతు ధర చట్టం చేయాలన్నారు. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ మల్లు నాగార్జున రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, ములకలపల్లి రాములు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఎం.రాంబాబు, దండా వెంకటరెడ్డి, వేల్పుల వెంకన్న, నరసింహారావు, వీరబోయిన రవి, ఎల్గూరి గోవింద్, మడ్డి అంజిబాబు, మద్దెల జ్యోతి, శీలం శ్రీను, షేక్. జహంగీర్ పాల్గొన్నారు.

అందని గ్యాస్ రాయితీ

- ఆరు నెలలుగా జమకాని వంట గ్యాస్ సబ్సిడీ డబ్బులు
- అర్హులందరికీ అందని మహాలక్ష్మి పథకం
- అధిక ధర చెల్లిస్తున్న వినియోగదారులు
- జిల్లాలో 1,62,718 మంది లబ్ధిదారులు



భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో వంటగ్యాస్ వినియోగదారులు రాయితీ సొమ్ము కోసం ఐదారు నెలలుగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకంలో రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందించే పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం ప్రారంభించిన నాటినుంచి కొన్నాళ్ల పాటు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో సబ్సిడీ డబ్బులు సక్రమంగానే జమ చేసినా.. ఐదారు నెలలుగా పడడం లేదు. దీంతో లబ్ధిదారులు ఎవరిని సంప్రదించాలో అర్థం కాక అయోమయానికి గురవుతున్నారు.

4,10,075 కనెక్షన్లు..

జిల్లాలో 4,10,075 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే గ్యాస్ పొందేందుకు జిల్లా వ్యాప్తంగా దాదాపు 3,26,363 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 1,62,718 మందిని అర్హులుగా గుర్తించారు. వీరికి మొదట్లో గ్యాస్ నింపిన తర్వాత సబ్సిడీ మొత్తాన్ని వారి ఖాతాలో జమ చేయగా ఐదారు నెలలుగా ఆ ప్రక్రియ నిలిచిపోయిందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. పథకం ప్రారంభించిన సమయంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.874 ఉండగా లబ్ధిదారులు చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.500లను వారి ఖాతాలో జమ చేసేది. ఇదే కాకుండా కేంద్ర ప్రభుత్వం రూ.47లను రాయితీ కింద జమ చేసేది. ఈ లెక్కన ఒక్క సిలిండర్ రూ.326లకే లబ్ధిదారునికి అందేది. ఈ సమయంలో ఈ పథకం నిరుపేదలకు మధ్యతరగతి వారికి ఆసరాగా నిలిచింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడం, గ్యాస్ ధరలు కూడా పెరగడంతో సామాన్యులపై భారం పడుతోంది.

సగం మంది దూరమే..

ప్రజాపాలన సమయంలో వచ్చిన దరఖాస్తుల్లో సగం దరఖాస్తులకు మోక్షం లభించింది. 3,26,363 దరఖాస్తులకు గాను 1,62,718 మందిని అర్హులుగా ప్రకటించారు. మరో 1,63,645 మంది ఇప్పటికీ ఈ పథకంలో లబ్ధి చేకూరలేదు. ప్రధానంగా దరఖాస్తులు అందించే సమయంలో నిరక్షరాస్యులు సరిగా నింపకపోవడం, ఆన్‌లైన్ చేసే సమయంలోనూ ఆపరేటర్లు తప్పులు చేయడంతో పాటు సమయాభావం కారణంగా చాలావరకు పెండింగ్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలో సగం మంది మహాలక్ష్మి పథకానికి దూరమయ్యారు. ఇప్పటివరకు 4,61,714 సిలిండర్లను లబ్ధిదారులకు అందించగా రూ.13.24 కోట్ల రాయితీ జమ అయినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మొత్తం గ్యాస్ కనెక్షన్లు	:	4,10,075
ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు	:	3,26.363
గుర్తించిన అర్హులు	:	1,62,718 మంది
ఇప్పటి వరకు తీసుకున్న గ్యాస్‌సిలిండర్లు	:	4,61,714
ఇందుకు సబ్సిడీ	:	రూ. 13.24 కోట్లు

ఒక్కసారి కూడా డబ్బులు పడలేదు



మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం అందించే గ్యాస్ సబ్సిడీ మాకు అందడం లేదు. ప్రజా పాలన సమయంలో దరఖాస్తులను అందించిన ప్రయోజనం లేకుండా పోయింది. ఈ పథకానికి మేము అన్ని విధాలుగా అర్హులమే. దరఖాస్తులు ఎక్కడ ఇవ్వాలో తెలియడం లేదు.

– చామకూరి మాధవి, తిమ్మాపురం

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారి మేల్కొలుపులో సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. అనంతరం గర్భాలయంలోని స్వయంభూలు, సువర్ణప్రతిష్ఠా అలంకారమూర్తులను అభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అదే విధంగా ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

క్లుప్తంగా

మూర్ఛతో పొలంలో పడి వ్యవసాయ కూలీ మృతి


సైదులు (ఫైల్)

చిట్యాల: వ్యవసాయ పొలంలో పనిచేస్తున్న కూ లీకి మూర్ఛ(ఫిట్స్) రావడంతో బురదలో కూరుకుపోయి ఊపిరిడాక మృతి చెందాడు. ఈ ఘటన చిట్యాల మండలం నేరడ గ్రామంలో గురువారం జరిగింది. ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. నేరడ గ్రామానికి చెందిన వడ్డెపల్లి సైదులు(40) గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో కూలీ పనికి వెళ్లాడు. పొలంలో పనులు చేస్తుండగా ఒక్కసారిగా అతడికి మూర్ఛ రావడంతో పొలంలోని బురదలో పడిపోయాడు. ఆ సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో బురదలో ఊపిరిడాడక అక్కడికక్కడే మృతిచెందాడు. కొద్దిసేపటి తర్వాత పలువురు కూలీలు గుర్తించి పొలంలో నుంచి బయటకు తీసుకొచ్చారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలున్నారు. మృతుడి భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలలు జైలు శిక్ష

కోదాడరూరల్ : తీసుకున్న అప్పుకింద చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి కోదాడ ప్రిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె. భవ్య ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. వివరాలు.. కోదాడ పట్టణానికి చెందిన కొదుమూరి ప్రవీణ్ వద్ద రంగాపురపు ఉమామహేశ్వర్ రూ.5లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు కింద 2014లో ఉమామహేశ్వర్ ప్రవీణ్‌కు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కు బ్యాంకులో చెల్లకపోవడంతో ప్రవీణ్ కోర్టును ఆశ్రయించాడు. సుదీర్ఘకాల విచారణ అనంతరం కేసు తుది విచారణలో భాగంగా గురువారం ఉమామహేశ్వర్‌కు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.5లక్షల నగదు చెల్లించాలని జడ్జి తీర్పు వెలువరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


బిచ్యా (ఫైల్)

పాలకవీడు: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పాలకవీడు మండలం మిగడంపహాడ్‌తండాలో గురువారం జరిగింది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిగడంపహాడ్‌తండాకు చెందిన సపావత్ బిచ్యా(45) ఎలక్ట్రీ షియన్‌గా పనిచేస్తున్నాడు. అదే తండాకు చెందిన ఓ రైతు వ్యవసాయ పొలం వద్ద బోరు మోటారుకు కరెంట్ సరఫరా కాకపోవడంతో గురువారం బిచ్యాను పిలిచాడు. బిచ్యా ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూడగా.. 11కేవీ విద్యుత్ తీగ తెగిపడి ఉండటం గమనించి మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య కస్తూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యభిచారం గృహంపై పోలీసుల దాడి

- ఇద్దరు విటులు, ఆరుగురు మహిళలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామ శివారులోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం దాడి చేసినట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపారు. గూడూరు గ్రామ శివారులో గల ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ఇంట్లో తనిఖీలు చేసి ఇద్దరు విటులతో పాటు మరో ఆరుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, రూ.1000 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీమాతో మహిళలకు దీమా

- సమభావన సంఘాల సభ్యులకు లోన్ బీమా, ప్రమాద బీమా పథకాలు
- అవగాహన లేక సద్వినియోగం చేసుకోలేకపోతున్న మహిళలు

ఆత్మకూరు(ఎం): సమభావన సంఘాల సభ్యులకు అమలవుతున్న కొత్త పథకాలతో మహిళలు దీమాగా ఉండవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం సమభావన సంఘాల సభ్యులకు 2024 మార్చిలో లోన్ బీమా, ప్రమాద బీమా అనే పథకాలకు రూపకల్పన చేయగా.. ఉమ్మడి జిల్లాలో ఇప్పుడిప్పుడే అవి అమలవుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో 673 గ్రామ సంఘాలు ఉన్నాయి. 18,112 సమభావన సంఘాలు ఉండగా.. అందులో 2,02,393 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు.

లోన్ బీమా..

లోన్ బీమా కింద 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల మహిళలు సమభావన సంఘంలో సభ్యురాలిగా ఉండి బ్యాంక్ లింకేజీ కింద రుణం తీసుకుని ప్రమాదవశాత్తు మరణిస్తే తిరిగి రుణం చెల్లించనవసరం లేదు. ఈ రుణం ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఈ పథకం కింద యాదాద్రి భువనగిరి జిల్లాలో 72 మంది మహిళలు(సమభావన సంఘాల్లో సభ్యులు) రిజిస్ట్రేషన్ చేసుకోగా.. అందులో ఇప్పటివరకు మృతిచెందిన 21 మంది సభ్యులకు బీమా వర్తించింది.



భువనగిరి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కార్యాలయం

ప్రమాద బీమా..

సమభావన సంఘంలో సభ్యురాలై ఉండి స్త్రీనిధి రుణం తీసుకుని 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. ప్రమాదవశాత్తు సభ్యురాలు మరణిస్తే రూ.10లక్షలు సభ్యురాలు సూచించిన నామినీకి అందజేస్తారు. వీఓ తీర్మానం, ఓబీ తీర్మానం, సెర్ప్ ఏపీఎం, సీసీల తీర్మానం మేరకు బాధితురాలికి ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం కింద భువనగిరి జిల్లాలో ముగ్గురు సభ్యుల కుటుంబాలు లబ్ధి పొందగా.. వారికి త్వరలో రూ.10లక్షల చొప్పున జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సభ్యులు అందజేయనున్నారు.

అవగాహన కల్పించాలి



లోన్ బీమా, ప్రమాద బీమా పథకాలపై అధికారులు అవగాహన కల్పించాలి. ఈ రెండు పథకాలను సమభావన సంఘాల్లో సభ్యులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. సంఘాల్లోని ప్రతి సభ్యురాలికి అవగాహన కల్గించేలా చర్యలు తీసుకోవాలి.

– రచ్చ పల్లవి, జిల్లా మహిళాసమాఖ్య ప్రధాన కార్యదర్శి

ఆర్థికంగా బలోపేతం కావాలి



ఈ రెండు బీమా పథకాలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అమలు చేస్తున్నాం. స్వయం ఉపాధి కోసం సమభావన సంఘాల్లోని మహిళలు స్త్రీనిధి రుణాలు తీసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలి. ఒకవేళ వారికి ఏమైనా అయితే బీమా వర్తిస్తుంది.

– టి. నాగిరెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి

బ్లాక్‌మెయిల్ చేస్తున్నందుకే వివాహిత హత్య

- నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన కొండమల్లేపల్లి సీఐ నవీన్‌కుమార్


వివరాలు వెల్లడిస్తున్న కొండమల్లేపల్లి సీఐ నవీన్‌కుమార్, గుర్రంపోడు ఎస్‌ఐ మధు

గుర్రంపోడు: తన వద్ద ఫొటోలు, వీడియోలు ఉన్నాయని.. అవి బయటపెట్టి పోలీస్ స్టేషన్‌లో కేసు పెడతాను అని బ్లాక్‌మెయిల్ చేసినందుకే గుర్రంపోడు మండలం జూనూతల గ్రామానికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు హత్య చేశాడని పోలీసులు తెలిపారు. ఈ కేసు వివరాలను గురువారం కొండమల్లేపల్లిలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ నవీన్‌కుమార్, గుర్రంపోడు ఎస్‌ఐ మధు విలేకరులకు వెల్ల డించారు. గుర్రంపోడు మండలం జూనూతల గ్రామానికి చెందిన మంకెన జ్యోతి భర్త, పిల్లలతో కలిసి మిర్యాలగూడలో నివాసముంటోంది. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామానికి గొడితల మహేష్.. గత ఏడేళ్లుగా జూనూతల గ్రామంలో అద్దె ఇంట్లో భార్య, పిల్ల లతో ఉంటూ ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు. గతేడాది జూనూతల గ్రామానికి చెందిన జ్యోతి బంధువు కడుపునొప్పితో అదే గ్రామంలో ఆర్‌ఎంపీగా పనిచేస్తున్న గొడితల మహేష్ వద్దకు వెళ్లింది. ఆర్‌ఎంపీ మహేష్ జ్యోతి బంధువును నల్లగొండ ఆస్పత్రికి తీసుకెళ్లి అడ్మిట్ చేశాడు. బంధువును చూసేందుకు నల్లగొండ ఆస్పత్రికి వచ్చిన జ్యోతికి, ఆర్‌ఎంపీ మహేష్‌తో సన్నిహిత్యం ఏర్పడింది. ఆ తర్వాత వారిద్దరూ ఫోన్‌లో, వాట్సాప్ వీడియో కాల్స్‌లో సన్నిహితంగా మాట్లాడుకునేవారు. మిర్యాలగూడలో ఉంటున్న జ్యోతి తరచూ మహేష్‌కు ఫోన్ చేసి తన వద్దకు రమ్మని సతాయిస్తూ అతడితో గొడవ పెట్టుకుంది. అంతేకాకుండా తన వద్దకు రాకుంటే వీడియోలు, ఫొటోలు ఉన్నాయని పోలీస్ స్టేషన్‌లో కేసు పెడతానని బెదిరించింది.

పథకం ప్రకారమే..

జ్యోతి ఎప్పటికైనా తనపై కేసు పెట్టి తనకు భవిష్యత్తు లేకుండా చేస్తుందని భావించిన ఆర్‌ఎంపీ మహేష్ ఎలాగైనా ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో గత నెల 29న రాత్రి మిర్యాలగూడ నుంచి మల్లేపల్లికి బస్సులో వచ్చిన జ్యోతిని తన కారులో ఎక్కించుకున్న మహేష్ నల్లగొండ వరకు వెళ్లి తిరిగి జూనూతుల గ్రామానికి వస్తున్నారు. రాత్రి 11గంటల సమయంలో కొప్పోలు గ్రామ సమీపంలో కారును రోడ్డు పక్కకు ఆపి జ్యోతిపై మహేష్ అత్యాచారం చేశాడు. ఆ తర్వాత ఆమె చేత బీపీ తగ్గి స్పృహ కోల్పోయేలా 8 మాత్రలు మింగించాడు. ఆ తర్వాత జ్యోతి స్పృహ కోల్పోతున్న క్రమంలో పది రోజుల క్రితమే గుర్రంపోడులో కొనుగోలు చేసి కారులో సిద్ధంగా ఉంచుకున్న గడ్డి మందును రెండు ఇంజెక్షన్ల ద్వారా ఆమె రెండు చేతులకు ఎక్కించాడు. అప్పటికీ ఆమె పూర్తిగా స్పృహ కోల్పోలేదని గ్రహించిన మహేష్ ఆమె చేత గడ్డి మందు నీళ్లలో కలిపి బలవంతంగా తాగించాడు. అదే రోజు రాత్రి దేవరకొండ ఆస్పత్రికి తీసుకెళ్లి గడ్డి మందు తాగిందని చెప్పి జ్యోతిని ఆస్పత్రిలో చేర్పించి పరారయ్యాడు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గుర్రంపోడు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడి ఆచూకీ కోసం మల్లేపల్లి సీఐ నవీన్‌కుమార్, గుర్రంపోడు ఎస్‌ఐ పి. మధు, కానిస్టేబుళ్లు సత్యనారాయణగౌడ్, వీక్షిత్‌రెడ్డి, నాగరాజు, సైదులు మూడు బృందాలుగా ఏర్పడి గాలించారు. ఈ క్రమంలో గురువారం ఉదయం పదకొండు గంటల ప్రాంతంలో జూనూతుల గ్రామ బస్ స్టేజీ వద్ద నిందితుడు మహేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని అతడి వద్ద సిరంజీలు, టాబ్లెట్లు, గడ్డిమందు డబ్బా, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని దేవరకొండ కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. నేరస్తుడిని పట్టుకోవడంలో చొరవ చూపిన సీఐ నవీన్ కుమార్, ఎస్‌ఐ పసుపులేటి మధు, కానిస్టేబుళ్లను దేవరకొండ ఏఎస్పీ మౌనిక అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని మృతుడి బంధువుల ఆరోపణ
- ఆస్పత్రి ఎదుట ఆందోళన


మృతుడి బంధువులతో మాట్లాడుతున్న మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐ మోతీరాం

మిర్యాలగూడ అర్బన్: గుండె నొప్పితో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవిదేవులపల్లి మండలం కొంతనందికొండ గ్రామానికి చెందిన సుంకిశాల ముత్తయ్య(60)కు రెండు రోజుల క్రితం గుండెనొప్పి రావడంతో మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలోని గల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. అతడి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం వేరొక ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ముత్తయ్య మృతికి ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులే కారణమని ఆరోపిస్తూ అతడి బంధువులు గురువారం ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐ మోతీరాం, ఎస్‌ఐ సైదిరెడ్డితో కలిసి ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆస్పత్రి యాజమాన్యం, మృతుడి బంధువులతో చర్చించి తగిన న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ ఘటనపై ఆస్పత్రి యాజమాన్యాన్ని వివరణ కోరగా.. రోగి మృతి పట్ల తమ నిర్లక్ష్యం ఏమీలేదని, గుండెపోటు తీవ్రం కావడంతోనే మృతిచెందాడని పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి..


సుధాకర్ (ఫైల్)

మోత్కూరు: వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మండల పరిధిలోని పల్రెపాడు గ్రామానికి చెందిన ఏగూరి స్వరూప కుటుంబం 20ఏళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం మోత్కూరు పట్టణానికి వచ్చి స్థానిక కొత్త బస్టాండ్ కాలనీలో నివాసముంటున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె భర్త గతంలోనే మృతిచెందాడు. స్వరూప ఇళ్లలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ వస్తోంది. స్వరూప చిన్న కుమారుడు సుధాకర్(30) జూన్ 27న వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగాడు. అతడిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. మృతుడు గ్రామంలో బ్యాండ్ వాయిస్తూ జీవనం సాగించేవాడు. మృతుడి అన్న హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తూ జీవనంసాగిస్తున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

- రెండు బైక్‌లు స్వాధీనం

నాగార్జునసాగర్: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న దొంగను సాగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సాగర్ ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్‌లోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద గురువారం ఉదయం ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా.. బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా.. అతడిని వెంబడించి పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తి చందంపేట మండలం జగ్నతండాకు చెందిన రమావత్ రాముగా పోలీసులు గుర్తించారు. అతడి విచారించగా.. గత నెల 3వ తేదీన విజయపురి టౌన్ పైలాన్ కాలనీలో పల్సర్ బైక్ చోరీ చేశానని, ఆ బైక్‌ను మాచర్లలో విక్రయించడానికి వెళ్తున్నట్లు నిజం ఒప్పుకున్నాడు. అంతేకాకుండా మాచర్ల పట్టణంలో మరో బైక్‌ను అపహరించి జగ్నతండాలోని తన ఇంట్లో దాచినట్లు చెప్పాడు. పోలీసులు అతడితో పాటు జగ్నాతండాకు వెళ్లి ఆ బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని కోర్టులో ప్రవేశ పెట్టగా జడ్జి అతడికి 14 రోజుల జ్యూడీషియల్ రింమాండ్ విధించినట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.


నిందితుడిని చూపుతున్న పోలీసులు

సీఎంఆర్‌పై తనిఖీలు

▶ మొదటి పేజీ తరువాయి

మాత్రమే అప్పగించారు. ఇంకా 1,37,884 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వాల్సి ఉంది.

- **సూర్యాపేట జిల్లాలో** 2023–24 యాసంగి సీజన్‌కు సంబంధించి 2,40,578 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వగా, 1,62,483 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా, మిల్లర్లు 1,25,155 బియ్యం ఇచ్చారు. ఇంకా 37,328 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది.
- 2024–25 వానాకాలం సీజన్‌కు 1,68,791 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 1,13,395 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా, 51,851 మెట్రిక్ టన్నులు ఇచ్చారు. ఇంకా 61,544 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది.
- యాసంగి సీజన్‌కి సంబంధించి 2,80,569 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వగా, దానికి సంబంధించి 1,88,076 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. అయితే, ఇప్పటి వరకు 8,687 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చారు. ఇంకా 1,79,389 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉంది. ఇప్పుడు మిల్లుల వద్ద ఆ ధాన్యం ఉందా? లేదా? అనే అంశంపై బృందాలు తనిఖీలు చేపట్టనున్నాయి.

అవినీతి చెకింగ్‌లకు ఇక..‘చెక్’!

▶ మొదటి పేజీ తరువాయి

పని చేస్తున్నారు. వీరు నిత్యం వాహనాలను తనిఖీ చేసి పంపాల్సి ఉండగా.. అధికారులు వారి గదుల్లోనే కూర్చొని సేదతీరుతుంటారు. వీరు నియమించుకున్న ప్రైవేట్ వ్యక్తులు వాహనదారుల నుంచి వివిధ రకాల కొర్రీలు చూపుతూ వసూళ్లకు తెగబడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమ అక్రమాలు బయటకు రాకుండా వీరు అన్ని వర్గాల వారికి నెలవారీగా వేలల్లో మాముళ్లు ముట్టజెపుతున్నారనే అభియోగాలు కూడా ఉన్నాయి. చెక్‌పోస్టలలో అవినీతిని తట్టుకోలేక వీటిని తప్పించుకోవడానికి కొంత మంది వాహనదారులు డొంకరోడ్లను ఆశ్రయిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

పాత కమిషనర్ వెళ్లలేదు.. కొత్త కమిషనర్ చేరలేదు..!

- ఆలేరు మున్సిపాలిటీలో విచిత్ర పరిస్థితి
- చర్చనీయాంశంగా మారిన మున్సిపల్ కమిషనర్ల బదిలీ


ఆలేరు మున్సిపల్ కార్యాలయం

ఆలేరు: ఆలేరు మున్సిపాలిటీలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లకు ప్రభుత్వం స్థానచలనం కల్పించింది. సీడీఎంఏ కార్యాలయంలో సూపరింటెండెంట్‌లుగా ఉన్న కొందరికి కమిషనర్లుగా పదోన్నతులు కల్పిస్తూ సర్కారు పోస్టింగ్‌లు ఇచ్చింది. కమిషనర్లుగా కొనసాగుతున్న వారిని ఇతర మున్సిపాలిటీలకు బదిలీ చేసింది. ఈ మేరకు గత నెల 23వ తేదీన ఉత్వర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఆలేరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను భూపాలపల్లి(ద్వితీయ శ్రేణి) మున్సిపాలిటీకి బదిలీ చేసింది. శ్రీనివాస్ స్థానంలో ఆలేరు మున్సిపల్ కమిషనర్‌గా సీడీఎంఏ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకట్‌రాములును నియమించింది. సాధారణంగా బదిలీ ఉత్తర్వులు వెలువడిన వారం, పది రోజుల్లో పాత అధికారులు రిలీవ్ కావడం.. కొత్త వారు బాధ్యతలు స్వీకరణ ప్రక్రియ పూర్తి కావాలి.

కొత్త కమిషనర్‌కు చుక్కెదురు..

భూపాలపల్లి మున్సిపాలిటీకి బదిలీ అయిన కమిషనర్ శ్రీనివాస్ రిలీవ్ కాకపోవడంతో ఈ నెల 26వ తేదీన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన వెంకట్‌రాములకు చుక్కెదురైంది. దీంతో ఆయన జాయినింగ్ రిపోర్ట్ చేయడానికి వీలుకాలేదని తెలిసింది. అయితే ప్రభుత్వ ఉత్వర్వులు జారీ చేసి పది రోజులవుతున్నా కొత్త కమిషనర్ వెంకట్‌రాములు బాధ్యతలు స్వీకరించేందుకు ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది.

కార్యాలయ వర్గాల్లో చర్చ..

ఒక వేళ శ్రీనివాసే కమిషనర్‌గా కొనసాగించాలని ఉన్నతాధికారులు భావిస్తే పది రోజుల క్రితం ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వు రద్దు చేసి, రివైజ్డ్ ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడు వెంకట్‌రాములుకు మరో మున్సిపాలిటీకి పోస్టింగ్ ఇచ్చేందుకు ఆస్కారం కలుగుతుంది. కానీ ఇప్పటివరకు రివైజ్డ్ ఆదేశాలు అధికారులు జారీచేయని నేపథ్యంలో ఆలేరు మున్సిపాలిటీకి శ్రీనివాస్, వెంకట్‌రాములు ఇద్దరు కమిషనర్లు అన్నట్లుగా పరిస్థితి మారింది. ఈ క్రమంలో ప్రస్తుతం విధుల్లో ఉన్న కమిషనర్ శ్రీనివాసే ఇక్కడ కొనసాగుతారా లేదా కొత్త కమిషనర్ వెంకట్‌రాములు బాధ్యతలు స్వీకరించనున్నారా అనేది ఇప్పుడు కార్యాలయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రాజకీయ జోక్యమే కారణమా?

ప్రభుత్వ ఉత్వర్వులు వెలువడినా రాజకీయ జోక్యం కారణంగానే వెంకట్‌రాములు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించలేకపోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. శ్రీనివాస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి ఐదు నెలలే అయినందున ఆయన బదిలీని పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం. జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి ఒత్తిడి కూడా శ్రీనివాస్ బదిలీకి బ్రేక్ పడటానికి మరో కారణమనే తెలుస్తోంది.

వివాహిత అదృశ్యం

చందంపేట: చందంపేట మండలం కాట్రావత్‌తండాకు చెందిన కాట్రావత్ శీల గత నెల 10వ తేదీ రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె కుటుంబ సభ్యులు ఎంత వెతికినా శీల ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం చందంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712670225 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నాగార్జునసాగర్‌లో..

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని పైలాన్‌కాలనీకి చెందిన బత్తుల విజయలక్ష్మి గత నెల 28వ తేదీ మధ్యాహ్నం నుంచి అదృశ్యమైనట్లు విజయపురిటౌన్ ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు. ఎంత వెతికినా విజయలక్ష్మి ఆచూకీ లభించకపోవడతో ఆమె తల్లి బత్తుల రాధ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

భూ వివాదంలో దాడి.. ఇద్దరికి గాయాలు

పెన్‌పహాడ్: భూ వివాదంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామ శివారులో గురువారం జరిగింది. ఎస్‌ఐ గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడేనికి చెందిన శానం కళమ్మకు పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామ శివారులో ఎకరం 5గుంటల భూమి ఉంది. ఈ భూమి విషయమైతన మరిది శానం వెంకటేశ్వర్లుతో కొద్దికాలంగా గొడవలు జరుగుతున్నాయి. గురువారం కళమ్మ, ఆమె భర్త రామలింగయ్య, కుమారుడు భరత్‌కుమార్ భూమిలో పనిచేస్తుండగా శానం వెంకటేశ్వర్లు, వీరభద్రమ్మతో పాటు వారి ఇద్దరు కుమారులు కలిసి గొడ్డలి, సైకిల్ చైన్‌తో కళమ్మ కుటుంబ సభ్యులపై దాడి చేశారు. ఈ దాడిలో రామలింగయ్య, భరత్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. భరత్‌కుమార్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. కళమ్మ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బిందు సేద్యంలో ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

- కేవీకే కంపాసాగర్ సేద్యపు విభాగం శాస్త్రవేత్త చంద్రశేఖర్ సూచనలు


బిందు సేద్యంకు ఉపయోగించే పరికరాలు

త్రిపురారం: వ్యవసాయంలో బిందు సేద్యం వల్ల తక్కువ నీరు ఉన్నా వివిధ రకాల పంటలు సాగు చేసుకోవచ్చు. అయితే భూగర్భ జలాల నుంచి వచ్చే సన్నటి ఇసుక, మట్టి రేణువులతో పాటు పైపుల ద్వారా రసాయన ఎరువులు అందిండచం వల్ల బిందు సేద్యంలో ఉపయోగించే పరికరాలు త్వరగా దెబ్బతిని మోటార్లు మొరాయించే అవకాశం ఉంది. బిందు సేద్యం పరికరాలను భద్రపర్చుకోవడంతో పాటు సరైన జాగ్రత్తలు పాటించి శుభ్రం చేసుకోవడం ద్వారా ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సేద్యపు విభాగం శాస్త్రవేత్త చంద్రశేఖర్ సూచిస్తున్నారు. బిందు సేద్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

లెటరల్ పైపులకు యాసిడ్ ట్రీట్‌మెంట్

బిందు సేద్యం పరికరాల ద్వారా అందించే ఎరువుల వల్ల లిబరల్ పైపులకు ఉన్న రంధ్రాలు పూడుకపోయి నీరు కిందకు రావడం పలు సందర్భాల్లో నీరు నిలిచి మొక్కలకు అందవు. ప్రతి ఏటా పైపులను శుభ్రం చేసుకోవాలి. ఇందుకోసం తక్కువ గాడత గల హైడ్రోక్లోరిన్ లేదా సల్ఫ్యూరిక్ యాసిడ్‌ను వాడొచ్చు. యాసిడ్‌ను ఉపయోగించి పైపులను శుభ్రపరిచేందుకు రెండు పద్ధతులను పాటించవచ్చు. పంట లేని సమయంలో లెబరల్ పైపులను శుభ్రం చేసుకోవాలి.

1. ఎకరం పొలంలో గల లెబరల్ పైపులను శుభ్రం చేసుకునేందుకు 30 నుంచి 40 లీటర్ల హైడ్రోక్లోరిక్ యాసిడ్ అవసరం ఉంటుంది. 10మీ హౌస్‌పైప్‌ను యూ ఆకారంలో ఉండేలా అమర్చుకోవాలి. ఇందు కోసం రెండు వైపుల కట్టెలను పాతి వాటికి హౌస్‌పైపును కట్టి పైపును యాసిడ్‌లో ఉంచాలి. గాడత తక్కువ గల యాసిడ్‌ను మాత్రమే ఉపయోగించాలి.
2. ఎరువులను వదిలే ప్లాస్టిక్ పెర్టిగేషన్ ట్యాంకు ద్వారా శుభ్రపర్చాలి. పంట లేని సమయంలో మాత్రమే ఈ పద్ధతి అవలంబించాలి. ప్లాస్టిక్ ఫెర్టిగేషన్ ట్యాంకును ముందుగా శుభ్రపర్చుకోవాలి. ఆ తర్వాత తక్కువ గాఢత గల యాసిడ్‌ను నింపి నీటిని అందులోకి పంపాలి. ఈ ప్రక్రియను నెమ్మదిగా జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఇనుప పెర్టిగేషన్ ట్యాంకు ఉన్నట్లయితే వెంచూరి సహాయంతో లెటరల్ పైపులను శుభ్రం చేసుకోవడం ఉత్తమం.

డ్రిప్ పరికరాల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు

1. పంట కాలం సమయంలో యాసిడ్ ద్వారా డ్రిప్ పైపులను శుభ్రం చేయకూడదు.
2. డ్రిప్ కంపెనీలు సూచించిన యాసిడ్‌ను వారు నిర్దేశించిన మోతాదులోనే వాడాలి.
3. నీటిలో యాసిడ్ కలపాలి. యాసిడ్ ఉన్న ట్యాంక్‌లో నీటినిపై నుంచి ధారగా పోయరాదు.
4. ఫెర్టిగేషన్ లేదా వెంచూరి సహాయంతో యాసిడ్‌ను పంపేటప్పుడు నీటిని వాడకుండా చర్యలు తీసుకోవాలి.
5. డ్రిప్ పైపులు శుభ్రపడిన అనంతరం ఎండ్ క్యాప్‌లను తీసివేసి యాసిడ్ కలిపిన నీటిని వదిలివేయాలి.
6. శుభ్రపరిచిన పైపులను మరోసారి నీటితో కడగడం లేదా సబ్‌లైన్‌కు బిగించి నీటిని పారనివ్వాలి.
7. శుభ్రపరిచే సమయంలో రైతులు ముఖానికి చేతులకు తొడుగులు ధరించాలి. చలువ కళ్లద్దాలు వినియోగించడం ఉత్తమం.

స్క్రీన్ ఫిల్టర్ శుభ్రత అత్యంత కీలకం

బోర్లు, బావుల నుంచి వచ్చే నీటితో సన్నటి మన్ను, ఇసుక వస్తుంది. దీనివల్ల లెటరల్ పైపుల నుంచి నీరు వచ్చే మార్గాలు మూసుకుపోతాయి. దీని నివారణకు బోరు వద్ద నుంచి లెటరల్ పైపులకు నీరు వచ్చే ముందు స్క్రీన్ ఫిల్టర్ అమర్చుతారు. దీనిని వారం రోజులకు ఒకసారి శుభ్రపర్చుకోవాలి. ఫిల్టర్‌పై సన్నని రంధ్రాలు పూడిపోకుండా జాగ్రత్తపడాలి. కొత్తగా వేసిన బోరు నీరు ఉపయోగిస్తున్నట్లయితే కొన్నిరోజుల వరకు రోజుకు ఒక్కసారి ఫిల్టర్‌ను శుభ్రం చేసుకోవడం ఉత్తమమైన పద్ధతి. బావుల నుంచి నీటిని తీసుకునేటప్పుడు సాండ్ ఫిల్టర్‌ను అమర్చకోవాలి. రెండు ఫిల్టర్లతో రెండు దఫాలుగా వడపోత జరిగి లెటరల్ పైపుల్లోకి మట్టి, ఇసుక రాకుండా ఉంటుంది.